ప్రజాశక్తి

శనివారం 13 జనవరి 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

సంక్రాంతికి సొంతూళ్లకు

- భాగ్యనగరం నుంచి భారీగా తరలివస్తున్న ఉద్యోగులు
- జిల్లా నుంచి ఇతర జిల్లాలకు పయనం
- రద్దీగా రైళ్లు, బస్సులు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రజలు సమాయత్తమయ్యారు. ఒక వైపు వెళ్లే వారు, మరొక వైపు ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే వారితో జిల్లాలోని రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు అన్ని కిటకిటలాడుతున్నాయి. ఇదే సమయంలో ప్రజలకు ప్రయాణ కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రజల అవసరాల మేరకు బస్సులు, రైళ్లు అందుబాటులో ఉండటంలేదు. ఒకేసారి ఎక్కువమంది రిజర్వేషన్ల కోసం ప్రయత్నిస్తుండటంతో రైళ్లకూడా ఖాళీగా ఉండటం లేదు.

శుక్రవారం జిల్లా వ్యాప్తంగా రైళ్లు, బస్సులో ఎక్కువగా రద్దీ కన్పించింది. విద్యాసంస్థలకు ఈనెల 16 నుంచి సెలవులు ఇచ్చిన తల్లిదండ్రులకు శనివారం నుంచి సెలవులు కావడంతో ఎక్కువ మంది శుక్రవారం బయలు దేరారు. గుంటూరు నుంచి విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, నెల్లూరు తదితర ప్రాంతాలకు తరలి వెళ్లారు. కొంతమంది తెలంగాణలోని ఖమ్మం, వరంగల్ తదితర జిల్లాలకు కూడా రిజర్వేషన్లు చేయించుకున్నారు. రిజర్వేషన్లు లేని వారు టిక్కెట్లకోసం రైల్వేస్టేషన్లలో పడిగాపులు పడటం, క్యూలైన్లలో ఎక్కువ సేపు నిలబడటం కన్పించింది. కరెంటు రిజర్వేషన్లకూడా చాలా మంది క్యూకట్టారు. తత్కాల్ టిక్కెట్ల కోసం కూడా పెద్ద సంఖ్యలో ప్రయాణికులు వచ్చారు. రాష్ట్రంలోని అన్ని మార్గాల వైపు ఈనెల 22వ వరకు రాను పోను బెర్తులన్నీ నిండిపోయాయి. ప్రధానంగా ఆయా పట్టణాల్లో సాఫ్టవేర్ రంగంలో స్థిరపడిన వారు సొంత ఊళ్లకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా రైళ్లలో రిజర్వే షన్లు దొరక్క ▶ 2లో

ఆర్‌యుబిలు, ఆర్‌ఓబీల నిర్మాణానికి సహకరించండి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరిన మేయర్ మనోహర్‌నాయుడు



ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ బ్రిడ్జిల సహకరించాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య ప్రాంత అభివృద్ధిశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం గుంటూరు వచ్చిన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, బోకేతో ▶ 2లో



గుంటూరు సమ్మె శిబిరంలో సంఘీభావంగా మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి

- ఉద్యమానికి పూర్తి అండగా నిలుస్తాం - సిపిఎం, ప్రజా సంఘాల పిలుపు
- అన్నింటినీ తట్టుకుని పోరాటం అభినందనీయం - 32వ రోజుకు అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా



నరసరావుపేట శిబిరంలో సంఘీభావంగా మాట్లాడుతున్న ఎన్.రామరావు

వేతనాలు పెంపు, గ్రాట్యుటీ అమలు తదితర డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 32వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో ఐదవ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు సందర్శించి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీలను బెదిరించేందుకు షోకాజు నోటీసులు ఇవ్వటాన్ని వ్యతిరేకిస్తూ సమ్మె శిబిరం వద్ద నుండి స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, అక్కడ నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు ▶ 2లో

మూడ్రోజుల పాటు సంక్రాంతి సంబరాలు

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో నిర్వహణపై కలెక్టర్ ఎల్.శివశంకర్ ప్రకటన 2 లో



తహశీల్దార్ జట్టు విజయం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా శుక్రవారం అధికారుల మధ్య క్రికెట్ పోటీలు జరిగాయి. తహశీల్దార్ టీమ్‌కు మరియు ఎంపిడివో టీమ్ మధ్య మ్యాచ్‌లో తహశీల్దార్ టీమ్ విజయం సాధించింది. తహశీల్దార్ భవానీ శంకర్, ఎంపిడిఒ పుట్టారెడ్డి మాట్లాడుతూ ఆటలు శారీరక దఢత్వంతో పాటు మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. ప్రతిభ కనబర్చిన విఆర్వో హుస్సేన్‌కు మాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతి అందజేశారు. తహశీల్దార్ టీమ్‌కు కెప్టెన్‌గా విఆర్వో అశోక్, ఎంపిడివో టీమ్‌కు కెప్టెన్‌గా వెల్ఫేర్ అసిస్టెంట్ నాగబాబు వ్యవహరించారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న జిలాని

జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేస్తామని జనసేన నాయకులు బెల్లంకొండ అనీల్ అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు మన ఊరు- మన ఆట కార్యక్రమంలో భాగంగా అనీల్ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇంఛార్జి సయ్యద్ జిలాని హాజరై విజేతలకు బహుమతులు అందించారు. నాయకులు జివిఎస్ ప్రసాద్, కార్యకర్తలు, పాల్గొన్నారు.



బిజెపి ఓడి కాంగ్రెస్ గెలిస్తేనే రాష్ట్రానికి న్యాయం : కాంగ్రెస్

ప్రజాశక్తి - మాచర్ల : రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే విభజన హామీలు, ప్రత్యేక హోదా సులువుగా సాధించవచ్చునని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి, విభజన హామీలు అమలు చేయని బిజెపిని ఎట్టి పరిస్థితుల్లో ప్రజలు అధికారంలోకి రాన్వికూడదని చెప్పారు. రాష్ట్రానికి తీవ్ర ఆన్యాయం చేసిన కేంద్రంలోని బిజెపితో పొత్తులో ఉన్న జగన్ పార్టీ, పవన్ పార్టీకి, పవన్ పార్టీతో పొత్తులో ఉన్న టిడిపికి ఓటు వేస్తే వారు కేంద్రంలోని బిజెపికి మద్దతు తెలుపుతారని అన్నారు. ప్రత్యేక హోద, విభజన హామీలు, పోలవరం, రాజధాని అభివృద్ధి, విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవటం, నూతన పరిశ్రమలు తెచ్చుకోవటం తదితర ఇబ్బందులు తిరిగి వస్తాయన్నారు. సమావేశంలో షేక్ బాబు, కోటేశ్వరరావు, రాగిడి ప్రతాప్‌బాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఎ.ముప్పాళ్లలో శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 18వ రాష్ట్రస్థాయి చుక్కల,గీతల ముగ్గుల పోటీలను ఈనెల 16వ తేదీన నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందిస్తామని చెప్పారు.

ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి

(మొదటి పేజీ తరువాయి)

వినతిపత్రం అందజేశారు. నల్లపాడులోని ప్రాజెక్ట్ కార్యాలయంలోనూ వినతిపత్రం అందజేశారు. సమ్మె శిబిరంలో పాశం రామారావు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో, ఏళ్ల తరబడి పేద మహిళలు, శిశువులకు సేవలు అందిస్తున్న అంగన్‌వాడీలు నెలరోజులకుపైగా రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం కనికరం లేకుండా వ్యవహరిస్తోందన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా, సమ్మెను విచ్ఛిన్నం చేయటానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. ఇప్పుడు కూడా అనేక మందికి అధికారులు షోకాజు నోటీసులు ఇస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని ప్రజాస్వామ్య వాదులంతా వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. నిత్యావసర సరుకుల ధరలూ, పెట్రోలు, వంటగ్యాస్, ఇతర అన్ని రకాల ధరలూ అనేక రెట్లు పెరిగాయని, కానీ అంగన్‌వాడీల వేతనాలు మాత్రం పెంచలేదని గుర్తు చేశారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంచాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల ఇళ్ల వెళ్లి విధుల్లో చేరాలని, లేదంటే ఉద్యోగం ఉండదని కుటుంబ సభ్యులను, అంగన్‌వాడీలను బెదిరిస్తూ షోకాజు నోటీసులు ఇస్తున్నారన్నారు. ఇటువంటి చర్యలకు స్వస్తి పలికి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు చినవెంకాయమ్మ, టి.రాధ, శివలీల, పద్మావతి, రోజమ్మ, ప్రమీల, వేదవతి పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ప్రభుత్వం బెదిరింపుల ధోరణి కొనసాగిస్తూనే ఉంది. అంగన్వాడీలను అన్ని విధాలుగా భయపెట్టి సమ్మెలు విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు పన్నుతూనే ఉంది. ఇప్పటికే అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించినా అంగన్వాడీలు భయపడక పోవడంతో తాజాగా షోకాజు నోటీసులు జారీ చేసింది. అయినా అంగన్వాడీలు భయపడకుండా సమ్మె కొనసాగిస్తున్నారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో



జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ధర్నా చౌక్ వద్ద సమ్మె శిబిరాన్ని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, పిడిఎం నాయకులు ఎన్.రామారావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు కె.ఏడుకొండలు శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 32 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. సమ్మె శిబిరాల్లో కూర్చుంటున్న అంగన్వాడీలపై ఐసిడిఎస్ అధికారుల ద్వారా ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందని, షోకాజు నోటీసులు జారీచేయడంతోపాటు ఇళ్ల వద్ద లేని కార్యకర్తల గుమ్మాలకు నోటీసులు అందిస్తున్నారని విమర్శించారు. ఆరంభం నుండీ బెదిరింపులనే ప్రభుత్వం ఆయుధంగా చేసుకుందని, మరోవైపు అధికార పార్టీ నాయకుల ద్వారా కుట్రల పన్నిస్తోందని మండిపడ్డారు. వీటన్నింటినీ తట్టుకుని పోరాటాన్ని కొనసాగిస్తున్న అంగన్వాడీల పోరాట పటిమ అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, తామంతా అండగా ఉంటామని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగివచ్చి అంగన్వాడీల డిమాండ్లను అంగీకరించాలని కోరారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు కె.బ్రహ్మయ్య, యూనియన్ జిల్లా అధ్యక్షులు కెపి మెటిల్డాదేవి, నాయకులు శోభారాణి, నిర్మల, మాధవి, కవిత, సాయి, పద్మ పాల్గొన్నారు.

ఆర్‌యుబిలు, ఆర్‌ఓబీల నిర్మాణానికి సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో రోజురోజుకూ ట్రాఫిక్ రద్దీ పెరుగుతోందని, అందుకు తగిన విధంగా జిఎంసి రోడ్ల విస్తరణ చేపట్టిందని చెప్పారు. ట్రాఫిక్ రద్దీ తగ్గాలంటే రైల్వే లైన్ల వద్ద ఆర్‌ఓబీలు, ఆర్‌యుబీల నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. శంకర్ విలాస్ ఆర్‌ఓబీ, శ్యామల నగర్ ఆర్‌యుబి, నెహ్రు నగర్, సంజీవయ్య నగర్, గడ్డిపాడు రైల్వే లైన్ల వద్ద ఆర్‌వోబీలు, ఆర్‌యుబీల నిర్మాణాలకు సమగ్ర నివేదికలను ఇప్పటికే సిద్ధంగా ఉంచామని వివరించారు. వాటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుండి తగిన సహకారం అందించాలని కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

సంక్రాంతికి సొంతూళ్లకు

(మొదటి పేజీ తరువాయి)

బస్సులను ఆశ్రయిస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి కూడా జిల్లాకు వేలాది మంది తరలి వస్తున్నారు. దీంతో ఖాజా టోల్‌గేటు వద్ద కూడా రెండ్రోజులుగా వాహనాల రద్దీ పెరిగింది.

శుక్రవారం సాయంత్రం సికింద్రాబాద్ నుంచి వస్తున్న అన్ని రైళ్ల రద్దీగానే గుంటూరుకు వచ్చాయి. శబరి, పల్నాడు, నారాయాణాద్రి, చెన్నై, విశాఖ తదితర ఎక్స్‌ప్రెస్‌లలో ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఇతర ఉద్యోగులు కుటుంబాలతో గుంటూరుకు చేరుకున్నారు. గుంటూరు నుంచి తిరుపతి వైపు, నంధ్యాల, అనంతపురం, బెంగుళూరు, చెన్నై మార్గాలకు వెళ్లే రైళ్లన్నీ రద్దీగా వెళ్లాయి. ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి కూడా ఉమ్మడి జిల్లాకు చెందిన వారు సంక్రాంతికి సొంతూళ్లకు రావడం అనవాయితీగా వస్తోంది. కుటుంబంలోని రక్తసంబంధీకులు, బంధువులు యావత్తు ఏడాదికి ఒకసారి ఒకచోట కలిసి పండగ జరుపుకోవడం సంప్రదాయంగా ఉంది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబ సభ్యులు తమ బంధువల రాకకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బంధువులతో పాటు పలు ప్రాంతాల్లో గ్రామస్తులతో, స్థానికులతో కలిసి సంబంరాలు జరుపునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధానంగా గుంటూరు, తాడికొండ, తెనాలి, వేమూరు, పొన్నూరు, మాచర్ల, పెదకూరపాడు, సత్తెనపల్లి తదితర నియోజకవర్గాలకు చెందిన ఎన్‌ఆర్‌ఐలు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఎక్కువ మంది జిల్లాకు తరలి వస్తున్నారు.

మూడ్రోజుల పాటు సంక్రాంతి సంబరాలు

పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : పల్నాడు జిల్లాలో సంక్రాంతి సంబరాలు ఈ నెల 14, 15, 16 తేదీల్లో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో ఉన్న జిల్లా క్రీడా ప్రాంగణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శుక్రవారం తెలిపారు. 14 వ తేది ఉదయం భోగి మంటలు, ముగ్గులు, భోగి పండ్లు వంటి సంప్రదాయ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 15వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి 9 గంటల వరకు వివిధ కార్యక్రమాలు ఉంటాయని, ప్రముఖ సంగీత దర్శకురాలు ఎంఎం.శ్రీలేఖ సంగీత విభావరి, జబర్ధస్ట్ టీం రాజమౌళి, వినోదిని, కెవ్వు కార్తీక్ ప్రదర్శనలు, చెన్నై వారిచే జగ్లింగి, హైదరాబాద్ టీం వారి నృత్య ప్రదర్శన, సంప్రదాయ దుస్తుల ప్రదర్శన, పాడుతా తీయగా ఫేం సుమంత్, సునంద సంగీత విభావరి ఉంటుందని చెప్పారు. 16వ తేదీన సంగీత దర్శకులు రఘు కుంఎ జానపద పాటలు, జబర్ధస్ట్ టీం ఇమ్మనుయేలు, శాంతి స్వరూప్, నవీన్ ప్రదర్శనలు, హైదరాబాద్ టీము వారి నత్య ప్రదర్శన, బెంగుళూరు/గోవా వారి రష్యన్ క్విక్ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సంక్రాంతి సంబరాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

సంక్రాంతి సందర్భంగా పర్యాటక శాఖ రాయితీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్: సంక్రాంతి సందర్భంగా ఏపీ టూరిజం ఆధ్వర్యంలో పర్యాటకుల కోసం ప్రత్యేక ప్యాకేజీని ప్రవేశపెట్టినట్లు లాంచీ స్టేషన్ మేనేజర్ శివారెడ్డి శుక్రవారం తెలిపారు. శనివారం నుంచి 16వ తేదీ వరకు నాగార్జున కొండకు వెళ్లే విద్యార్థుల కోసం లాంచీ టికెట్ పై 15 శాతం రాయితీ ఇస్తామన్నారు. పర్యాటకుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తూ నాగార్జున కొండకు ప్రత్యేక లాంచీ సర్వీసులు నడపుతామని, విద్యార్థులు, పర్యాటకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తొండపిలో ఆరోగ్య శిబిరం

ప్రజాశక్తి-ముప్పాళ్ల : మండలంలోని తొండపిలో జగనన్న సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డిఎంహెచ్‌ఒ) డాక్టర్. బి.రవి, జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ పాల్గొన్నారు. వైద్య నిపుణులు సుధీర్ కుమార్, బదిరీనారాయణ, జయకృష్ణ ప్రవీణ్ 237 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఇఒపిఆర్‌డి రూపావతి, సర్పంచ్ సుశీల, సిహెచ్‌ఒ ఆంజనేయులు, హెల్త్ సూపర్ వైజర్లు పీటర్ డామియెన్, జోస్పిన్ రాణి పాల్గొన్నారు.

వడ్డెర సంక్షేమ భవన్ నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి - రెంటచింతల : కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలో వడ్డెర సంక్షేమ భవన నిర్మాణం పూర్తయినట్లు పంచాయతీరాజ్ డిఇ శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. నిర్మాణానికి జిల్లా మైనింగ్ ఫండ్ ద్వారా రూ.15 లక్షలను ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంజూరు చేయించారని, ఇతర నిర్మాణ పనులకు మరో రూ.15 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేశామని చెప్పారు. రెంటచింతలలో అంకమ్మ నగర్‌లో రూ.15 లక్షల ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో సీసీ రోడ్ల పనులు కూడా పూర్తయ్యాయన్నారు.

నాయకులకు కన్నా లక్ష్మీనారాయణ పరామర్శ

ప్రజాశక్తి-ముప్పాళ్ల : మండలంలోని నార్నెపాడులో రోడ్డు ప్రమాదంలో గాయపడిన టిడిపి సీనియర్ నాయకులు రావిపాటి దేవేంద్రరావును, కొంకావారిపాలెం కాలనీకి చెందిన వంశీని టిడిపి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, నాయయులు పి.కోటయ్య, లీలాఫర్ ఖాన్, మాబు సుభాని, కె.జార్జ్, ఎ.కృష్ణ, పెంచలయ్య పాల్గొన్నారు.



ఎంబిబిఎస్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే ఉద్యోగులు పెద్ద మనస్సుతో ప్రభుత్వ కళాశాల్లో ఫ్రీ సీట్లు పొందిన నలుగురు విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను ఇవ్వడం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం చైత్ర ట్రస్ట్ అధినేత రవికుమార్ ఆయన సతీమణి దామాసమ్మ ఆధ్వర్యంలో ఇద్దరు ఎంబిబియస్ విద్యార్థులు, అగ్రికల్చరల్ బిఎస్సి, డిప్లొమా కార్డియాలజీ టెక్నిషియన్ విద్యార్థినులకు డాక్టర్ కిరణ్ కుమార్ పది వేల రూపాయల స్కాలర్ షిప్ లను అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి లో మానసిక వైద్య విభాగం కౌన్సిలర్ రవి, అతని సతీమణి స్టాఫ్ నర్సు గా పని చేస్తున్న దామసమ్మ లు ముందుకు వచ్చి పది వేలు ఇవ్వడం సాధారణ విషయం కాదన్నారు. గత రెండేళ్ల నుంచి విద్యార్థులకు రెండు మూడు లక్షలు ఇస్తున్నారని ఆయన అన్నారు. రవి కుటుంబ సభ్యులను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. పల్నాడు లో విద్య లో వెనుకబాటు తనం ఇంకా కనిపిస్తోందని వారి చదువుకు ప్రభుత్వం తో పాటు స్వచ్ఛంద సేవ సంస్థలు ముందుకు వచ్చి ఆడుకుంటున్నారని ఆయన చెప్పారు.

పాథాలజీ ల్యాబ్‌కు హెమటాలజి ఎనలైజర్ బహూకరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



ప్రారంభిస్తున్నడాక్టర్ అపర్ణ

ప్రభుత్వ ఆసుపత్రి లోని క్లినికల్ పాథాలజీ ల్యాబ్ కు రూ. రెండున్నర లక్షల విలువ గల ఆటోమేటెడ్ హెమటాలజి ఎనలైజర్‌ను ఆ విభాగం హెచ్ ఓ డి డాక్టర్ అపర్ణ ఆమె తల్లి లక్ష్మీ పేరుతో అందించడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన హెమటాలజి ఎనలైజర్ పరికరం ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ పరికరం రక్త పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. జ్వరం వచ్చినప్పుడు, డెంగ్యూ ప్లేటిలెట్స్ తగ్గినప్పుడు తెల్ల కణాలు ఫలితాల కోసం ఈ పరికరం అందిస్తోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ రమణ, డాక్టర్ గువేరా, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని పాల్గొన్నారు.

టిడిపికి రాయపాటి రంగారావు రాజీనామా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపికి రాజీనామా చేసినట్టు ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాయపాటి రంగారావు తెలిపారు. గుంటూరు లక్ష్మీపురంలో శుక్రవారం రాత్రి జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అసలు రాజకీయ పార్టీయే కాదని వ్యాపార సంస్థ అని తెలిపారు. గత ఎన్నికల్లో లోకేష్, చంద్రబాబు మాదగ్గర ఎంత తీసుకున్నారో లెక్కలున్నాయన్నారు. మంగళగిరి లోకేష్ ఎలా గెలుస్తాడో చూస్తామని సవాల్ విసిరారు. కియా కంపెనీ నేనే తెచ్చారని చెప్పుకునే చంద్రబాబు మరి రాయలసీమలో ఎందుకు ఓడిపోయాడని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఎస్సీ నియోజకవర్గ ల్లో ఎమ్మెల్యేలను చంద్రబాబు లోకేష్ ఎక్కడ పనిచెయ్యనివ్వలేదన్నారు. కన్నా లక్ష్మీనారాయణ ఒక్క కులానికి పని చేస్తాడు మేము అన్ని కులాలకు పని చేస్తామని ఆయన వివరించారు. టిడిపిలో గుర్తింపు లేనందు వల్ల గత నాలుగు ఏళ్లుగా తాను చురుగ్గా పనిచేయలేదన్నారు. 2014 నుంచి 2019 వరకు టిడిపి హయంలో విపరీతమైన అవినీతి జరిగిందన్నారు. జన్మభూమి కమిటీలు,నీరు చెట్టు పేరుతో దోచుకున్నారని వివరించారు. 1982 నుంచి తమ తండ్రి రాయపాటి సాంబశివరావు కాంగ్రెస్‌లో ఆరు సార్లు ఎంపిగా గెలిచారని, 2014లో రాష్ట్ర విభజన నచ్చక కాంగ్రెస్‌నుంచి బయటకు వచ్చామన్నారు. త్వరలో తాను వైసిపిలో చేరతానని తెలిపారు. ఎన్నికల్లో వారు ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ పోటీ చేస్తానని చెప్పారు. లేదంటే పార్టీకోసం పనిచేస్తానన్నారు. తమ తండ్రి సాంబశివరావు వైసిపి ఎంపిలు విజయసాయిరెడ్డి, అయోధ్య రామిరెడ్డితో చర్చించారని తెలిపారు.

యువతను మోసం చేశారు : తెలుగు యువత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

యువతకు ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి రాగానే గాలికి వదిలేశారని యువతను పారిశ్రామిక వేత్తలుగా మారుస్తామని పెట్టిన ఫిష్ ఆంధ్ర ఫినిష్ ఆంధ్ర అయిందని గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణ తెలిపారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా టిడిపి నిరుద్యోగుల పక్షాన పోరాటంలో భాగంగా గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్ రైతు బజారు నుంచి పట్టాభిపురం వరకు ర్యాలీ నిర్వహించారు. యువతకు జగన్ ఇచ్చిన అమలుకాని హామీలను గ్యాస్ బెలూన్ల పైన వ్రాసి వినూత్న రీతిలో గాలిలోకి వదిలారు. జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి మాట్లాడుతూ జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల వారిని మోసం చేసిన విధంగానే నిరుద్యోగులను కూడా వంచించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిది యనమల విజయ్ కిరణ్ ,35 వడివిజన్ కార్పొరేటర్ ఇరంటి వరప్రసాద్ బాబు, గుంటూరు జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్ మీరా బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన వైసిపి : నశీర్ అహ్మద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :ప్రజలకు ఇచ్చిన ఎన్నో హామీలను ఉల్లఘించి మోసం చేయడం వల్ల వైసిపి ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని టిడిపి తూర్పు నియోజకవర్గం ఇన్‌ఛార్జి నశీర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం గుంటూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో నియోజకవర్గం సర్వసభ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాబోయే ఎన్నికల దృష్టిలో పెట్టుకొని నిత్యం ప్రజల్లో ఉండే విధంగా కార్యక్రమాలు చేపట్టామన్నారు. టిడిపి, జనసేన సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు నియోజకవర్గ పార్టీపరిశీలకులు గుడపాటి శ్రీనివాస్ రావు, నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి చిట్టాబత్తిన చిట్టిబాబు తదితరులు ప్రసంగించారు. టిడిపి కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ఆచార్యనాగార్జున యూనివర్సిటీ విసికి, రిజిస్ట్రార్‌కి వినతి పత్రం ఇస్తున్న కాంట్రాక్ట్ టీచర్లు

మూల్యాంకనం రెమ్యునరేషన్ పెంచాలి

ప్రజాశక్తి - ఎఎన్‌యు :ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్‌కి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో కలిసి ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ లెక్చరర్స్ అసోసియేషన్లు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిగ్రీ మూల్యాంకనం కేంద్రాలలో పనిచేస్తున్న వారికి, మూల్యాంకనం చేస్తున్న వారికి రెమ్యూనరేషన్ పెంచాలని కోరారు. డిగ్రీ కోర్సులకు ఒక్కో జవాబు పత్రానికి 18 రూపాయలు వర్సిటీ అందిస్తుందని దానిని 25 రూపాయలకు పెంచాలని కోరారు. అలాగే లోకల్ కన్వీనియన్స్ 150 రూపాయల నుంచి 250 లకు పెంచాలని కోరారు. నాన్ లోకల్ నుంచి రూ.350 నుంచి 450 రూపాయలకు పెంచాలని విన్నవించారు. వర్సిటీ 2019లో నిర్ణయించిందని అయితే నేడు నిత్యవసరాలు, అధిక ధరలు పెరిగినందున లెక్చరర్ల వినతి మేరకు పెంచాలని కోరారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడెడ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ రావు, ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేటు డిగ్రీ లెక్చరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి. నాగరాజు, శేషగిరిరావు, పలువురు లెక్చరర్ లు పాల్గొన్నారు.

కాజాలో ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ :మండలంలోని కాజా గ్రామంలో డివైఎఫ్ఐ, ఐద్వాల ఆధ్వర్యంలో ఆర్దల సూర్యనారాయణ క్రీడా ప్రాంగణంలో అప్పికట్ల శ్రీనివాసరావు, సింహాద్రి బసవ పున్నయ్య స్మారక సంక్రాంతి ఆటల పోటీలను శుక్రవారం ప్రారంభించారు. 12 నుండి 15 వరకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయా కమిటీలు తెలిపాయి. కార్యక్రమంలో అమరవీరులకు నివాళులు అర్పించారు. పోటీలను డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి కృష్ణ కాంత్, డి ఆర్ డి ఓ శాస్త్రవేత్త టీ గిరిధర్ గోపాల్, ఐద్వా నాయకులు సింహాద్రి సుమ, ఆర్దల శ్యామల జ్యోతి ప్రారంభించారు.

గుంటూరులో వడ్డెర గర్జన సభ

వడ్డెర్లకు తగిన టిక్కెట్లు ఇవ్వాలి : రాష్ట్ర నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :రాష్ట్రంలో 30 లక్షల జనాభా ఉన్న వడ్డెర సామాజిక వర్గానికి అన్ని పార్టీలు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు దేవళ్ళ వెంకట్, వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ దేవళ్ళ రేవతి, వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తన్నీరు ఆంజనేయులు కోరారు. గుంటూరులోని అరండల్‌పేటలో ఒ ఫంక్షన్ హాలులో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. వడ్డెర్లకు సముచిత స్థానం కల్పించని పార్టీలు ఎన్నికల్లో రాజకీయంగా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందనిహెచ్చరించారు, 2019 ఎన్నికల్లో వైసిపి వడ్డెర సామాజిక వర్గానికి చెందిన చంద్రగిరి ఏసురత్నంకు ఎమ్మెల్యే సీటు కేటాయించడంతో టిడిపిలో ఉన్న 80 శాతం మంది వడ్డెర్లు వైసిపి వైపు వచ్చారని గుర్తు చేశారు. ఏ పార్టీ అయితే తమకు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తుందో ఆ పార్టీకే తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. అవసరమనుకుంటే ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీ చేస్తామన్నారు. ఈ దిశగా వడ్డెర సామాజిక వర్గంలో చైతన్యం తెచ్చేలా త్వరలో గుంటూరులో వడ్డెర గర్జన సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. సభలో రాష్ట్ర నాయకులు బత్తుల వెంకటరమణ,వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి నాయకులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ఫాతిమారాణి అధ్యక్షత వహించారు. జెకెసి కాలేజి ఫిజికల్ సైన్స్ అధ్యాపకులు టి.బాలనరేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రైవేటు పాఠశాలలకు షోకాజు నోటీసులు

ప్రజాశక్తి-గుంటూరు : సంక్రాంతి సెలవులలో తరగతులు నిర్వహిస్తున్న వివిధ ప్రైవేటు పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ షోకాజు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం గుంటూరులోని పలు పాఠశాలల్లో విద్యాశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఎన్‌జిఓ కాలనీలోని సుమేధా హైస్కూల్, ఎటి అగ్రహారంలోని జికెఆర్ హైస్కూల్, రైలుపేటలోని మార్గరేట్ హైస్కూల్, అరండల్‌పేటలోని సెయింట్ ఇగ్నిషియస్ హైస్కూల్, సెయింట్ జోసఫ్స్ హైస్కూల్, గోరంట్లలోని కాపిటల్ హైస్కూల్, పాత గుంటూరులోని పీర్ల్ హైస్కూల్స్ యాజమాన్యాలకు షోకాజు నోటీసులు జారీ చేశారు.సెలవుల్లో పాఠశాలలు నిర్వహించకూడదని, అందుకు విరుద్ధంగా నడుచుకునే పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు : రూరల్ ఎస్ఐ

ప్రజాశక్తి పొన్నూరు రూరల్ :సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పొన్నూరు రూరల్ ఎస్ఐ బండ్ల భార్గవ్ శుక్రవారం మీడియాకు తెలిపారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో ఇప్పటికే మండలంలో నిఘ పటిష్టం చేశామని గతంలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించిన వారిని బైండోర్ చేసినట్లు పేర్కొన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



దుగ్గిరాల పోలీస్ స్టేషన్ సమీపంలో నిలిపివేసిన ఇసుక లోడ్ వాహనాలు

పోలీసుల అదుపులో ఇసుక వాహనాలు

ప్రజాశక్తి దుగ్గిరాల

పరిమితికి మించి ఎక్కువ లోడు వేశారని స్థానిక పోలీసులు మూడు ట్రక్కులను ఒక ట్రాక్టర్‌ను గురువారం అదుపులో కి తీసుకున్నారు. శుక్రవారం మంగళగిరి ఆర్‌డిఓ వేయింగ్ మిషన్ ద్వారా బరువు చూసి జరిమానా వేస్తారని పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలను నిలిపివేశారు. నిబంధన ప్రకారం ట్రాక్టర్‌కు ఐదు టన్నులు, లారీకి 25టన్నులు ఇసుక వేయాలి. టన్ను ఒకటికి రూ.470 ఇసుక రీచ్‌లోనే వసూలు చేస్తున్నారు బరువు ప్రకారం నీటి నుండి తోడిన ఇసుక వేసినట్లయితే ట్రక్కు పైభాగానికి లోడ్ రాదు, దీనితో కొనుగోలుదారులు ఇసుక కొనుగోలు చేయరని వాహనాల యజమానులు వాపోతున్నారు. రెండవ శనివారం కార్యాలయాలకు సెలవు ఇక పండుగ సెలవులు కూడా వరుసగా రావడంతో ఇప్పట్లో వాహనాలు బయటపడే మార్గం లేదని వాహన డ్రైవర్లు, యజమానులు ఆవేదనకు గురవుతున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - నకరికల్లు



మృతుడు బ్రహ్మయ్య (ఫైల్)

ద్విచక్ర వాహనం మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఒక వ్యక్తి చనిపోయిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రూపేన గుంట్ల గ్రామానికి చెందిన కంచేటి బ్రహ్మానందం (55) శాంతినగర్ పివిసి పైపుల కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. డ్యూటీ దిగి ఇంటికి వెళుతుండగా రూపినగుంట్ల గ్రామ ఆర్చి వద్ద అడ్డ రోడ్డు నుండి నరసరావుపేట వెళుతున్న ద్విచక్ర వాహనం అతివేగంతో ఢీకొట్టడంతో బ్రహ్మానందంకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బంధువులు సమాచారం తెలుసుకొని చికిత్స కోసం నరసరావుపేట ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని అన్న కోటేశ్వరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ బి ప్రసాద్ తెలిపారు. బ్రహ్మానందం కు భార్య శివ కుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



ఆటాడుదాం ఆంధ్రలో ఘర్షణ పడుతున్న ఇరు జట్లు

కబడ్డీ పోటీల్లో ఘర్షణ

ప్రజాశక్తి - నకరికల్లు

నకరికల్లు వంగ వెంకట రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర కబడ్డీ పోటీలలో కుంకలగుంట, చల్లగుండ్ల జట్ల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. శుక్రవారం నిర్వహించిన సెమీఫైనల్ మ్యాచ్‌లో ఇరుజట్లు హోరా హోరీగా తలపడ్డాయి. చివరి నాలుగు నిమిషాల వ్యవధిలో ఘర్షణ చోటు చేసుకోవడంతో ఎంపైర్లు మరియు పోలీసులు కలగజేసుకొని ఇరుజట్లను శాంత పరిచారు. అనంతరం ఆటను కొనసాగించగా చల్లగుండ్ల విజేతగా నిలిచింది. క్రీడలలో గెలుపు ఓటములు సహజమని ఆటగాళ్లందరూ క్రీడా స్ఫూర్తి తో ఆడాలని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

సంబరాల కోసం కళాకారులకు ఆహ్వానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సంక్రాంతి సందర్భంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని జిల్లా క్రీడా ప్రాంగణంలో సంబరాలు నిర్వహిస్తామని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీన భోగి, 15న సం[ఆకంతి సంబరాలు ఉంటాయని ఔత్సాహిక కళాకారులు నృత్యం, పాటలు, సంగీతం తదితర వాటిలో వారి ప్రతిభను కనబర్చేందుకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.శామ్యూల్ 9182717818, మరియు మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు 8074276942ను సంప్రదించాలని సూచించారు.



రాయవరంలో నీటి లభ్యతపై అధ్యయనం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

వాటర్ ఎయిడ్ ఇండియా ఆధ్వర్యంలో వాటర్ సెక్యూరిటీ బడ్జెట్ ఎక్సర్సైజ్ కార్యక్రమాన్ని మాచర్ల మండలం రాయవరంలో చేపట్టినట్లు బ్లాక్ కో-ఆర్డినేటర్ ఎం.గురుప్రసాద్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి బోర్లు, బావులు, వర్షాలు, కాల్వల ద్వారా ఎన్ని లక్షల నీరు అందుబాటులో ఉంటుందో ఈ కార్యక్రమం ద్వారా తెలుస్తుందన్నారు. గ్రామంలోని మనుషులకు, పశువులకు, పొలాలకు ఎన్ని లక్షల లీటర్ల నీరు అవసరం ఉంటుందో తెలుస్తుందన్నారు. గ్రామంలో సంవత్సరం మొత్తానికి అవసరమయ్యే నీరుకంటే అందుబాటులో ఉన్న నీరు ఎక్కువ ఉంటే వాటిని సంరక్షణ చేసే పద్ధతులు, సంవత్సరం మొత్తానికి అవసరమయ్యే నీరు కంటే తక్కువగా నీరుంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను చేపడతామని వివరించారు. ఇప్పటికే గ్రామంలో గ్రౌండ్ వాటర్ రీఛార్జ్ స్ట్రక్చర్స్ మూడు నిర్మించామని, రెండు రైన్ వాటర్ హార్వెస్టింగ్ స్టేషన్లు నిర్మించామని, ఎస్సీ కాలనీలో 81 కుటుంబాలకు ట్యాప్ స్టాండ్‌ల ద్వారా నీరందిస్తున్నామని, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం హ్యాండ్ వాష్ స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌రావు, వాలంటీర్ రోజా పాల్గొన్నారు.

కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి - కారంపూడి : సంక్రాంతి సందర్భంగా కారంపూడి, రెంటచింతల, దుర్గి పోలీస్ స్టేషన్ల పరిధిలో కోడిపందెలు, పేకాట, గుండాటలు ఇతర జూదలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కారంపూడి సిఐ దార్ల జయకుమార్ హెచ్చరించారు. అన్ని గ్రామాల్లో విస్తృత తనిఖీలు చేపడతామని ఎవరైనా కోడిపందేలు, జూదలు ఆడుతున్నా, వాటి నిర్వహణను ప్రోత్సహించిన ఎంతటివారైనా ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ప్రతిఒక్కరు ఆనందంగా సంక్రాంతి సంబరాలు చేసుకోవాలని, వివాదాలకు తావివ్వొద్దని, గ్రామాలలో కొత్త వ్యక్తుల సంచారం పట్ల అనుమానాలున్నా, జూదాలు నిర్వహిస్తున్నట్లు తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పిహెచ్‌సిలో జిల్లా వైద్యాధికారి తనిఖీ

ప్రజాశక్తి - పెదకూరపాడు : మండలంలోని తాళ్లూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డిఎంహెచ్ఒ) డాక్టర్ రవి శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మాపై ఇంత కక్షసాధింపు ఎందుకు?

32వ రోజుకు అంగన్వాడీల సమ్మె - శిబిరంలో ముగ్గులు, ఇతర రూపాల్లో కొనసాగిన నిరసనలు







ప్రజాశక్తి-సత్తెనపల్లి

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరుకుంది. స్థానిక తాలూకా సెంటర్లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో ముగ్గుల పోటీలతో వినూత్న నిరసన తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణేయితలుగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పట్టణ కార్యదర్శి జి.ఉమాశ్రీ, నాయకులు ఐ.అరుణ, కె.సుధా వ్యవహరించారు. ప్రథమ స్థానంలో అరుణ, ద్వితీయ స్థానంలో మహాలక్ష్మి, తృతీయ స్థానంలో స్వర్ణ నిలవగా బహుమతులు ప్రదానం చేశారు. శిబిరం వద్ద భోగి మంటలేసి నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి పి.మహేష్, ఐద్వా నాయకులు ఎ.శ్రావణి, ప్రశాంతి, అంగన్వాడి సత్తెనపల్లి ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు జి.సుజాత, ఎం.అహల్య, నాయకులు ధనలక్ష్మి, చాముండేశ్వరి, జ్యోతి, అంజలి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

సురేష్ మాల్ రోడ్డులోని అంగన్వాడి సమ్మె శిబిరం కొనసాగుతోంది. శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే, టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు సందర్శించి సంఘీభావంగా మాట్లాడారు. అంగన్వాడీల సేవలు అమూల్యమైనవని, అందుకే వారికి పార్టీలకతీతంగా మద్దతు లభిస్తోందని చెప్పారు. వారి సమస్యను ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు. ఇదిలా ఉండగా అంగన్వాడీలకు యుటిఎఫ్, ఎస్‌టిఎఫ్, ఎపిటిఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, నాయకులు శివరామకృష్ణ, ఎ.ఆంజనేయులు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు బిబి నాగేశ్వరరావు, వెంకాయమ్మ, వి.చంద్రమౌళి, అంగన్వాడీ నాయకులు పి.ఉమాశంకరి, నిర్మల, సిహెచ్.గాయత్రి, డి.బీబీలు నాగజ్యోతి, బి.శ్రీదేవి, జి.పద్మ, జె.పద్మావతి, హరిత, కృష్ణకుమారి, ఎఎల్ ప్రసన్న పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

అంగనవాడీలపై ప్రభుత్వానికి ఇంత కక్షసాధింపు ఎందుకని సిఐటియు మండల కార్యదర్శి బి.సూరిబాబు ప్రశ్నించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వద్ద సమ్మె శిబిరంలో ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని కోరడం తప్పా అని అన్నారు. నిత్యం అక్క చెల్లెమ్మలు అని మాట్లాడే సిఎం అంగన్వాడీలను ఎందుకు విస్మరిస్తున్నారని నిలదీశారు.

ప్రజాశక్తి - మాచర్ల

తాము గొంతెమ్మ కొర్కెలేమీ కోరటం లేదని, సుప్రీమ్‌కోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనాలు ఇవ్వాలని, గ్రాట్యూటీ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతున్నామని అంగన్వాడీ యూనియన్ నాయకులు ఉషారాణి అన్నారు. పట్టణంలోని సమ్మె శిబిరంలో అంగన్వాడీల నిరసన కొనసాగింది. శిబిరాన్ని ఉషారాణి ప్రారంభించి మాట్లాడారు. ఇందిర, కె.పద్మావతి, శాంతలత, కోటేశ్వరి, సుందరలీల, శారద, దుర్గా శివలక్ష్మి, రుక్మిణి, జయలక్ష్మి, శివపార్వతీ, లీలావతి, వెంకటరమణ, సైదమ్మ, చిలకమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల


పట్టణంలో సమ్మె శిబిరం కొనసాగుతోంది. కోటి సంతకాలు సేకరించి సిఎంకు అందించాలని అంగన్వాడీలు నిర్ణయించారు. దీనిలో భాగంగా తమ సెంటర్ పరిధిలోని పెద్దలు, మేధావులు, ప్రజానీకంతో సంతకాల సేకరణకు సిద్ధమయ్యారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు, అంగన్వాడి నాయకులు ఎస్కే హజ్ర, డి.శాంతమణి, శివరంజని, అరుణ, వాణి, రమణ, బుజ్జి, జయకుమారి, స్వప్న, అన్నమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక శాఖ గ్రంథాలయం వద్ద సమ్మె శిబిరం కొనసాగుతోంది. పలువురు అంగన్వాడీలు దీక్షల్లో కూర్చోగా వీరికి యూనియన్ సెక్టార్ అధ్యక్షులు జి. సావిత్రి పూలమాలలేసి దీక్షలను ప్రారంభించారు. సిఐటియు మండల కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. సమ్మె శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ సందర్శించి సంఘీభావం తెలిపారు. సిఎం సానుకూలంగా స్పందించకుంటే వచ్చే ఎన్నికల్లో ఆయన్ను ఇదే అంగన్వాడీలు ఇంటికి పంపుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం.విల్సన్, ఎస్.బాబు, షేక్ అల్లాభక్షు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద సమ్మె రోజు 32వ సంఖ్య వేసి నిరసన తెలిపారు.

ప్రజాశక్తి - క్రోసూరు : సమ్మె శిబిరం కొనసాగుతోంది. వీరికి సంఘీభావంగా స్థానిక ఆమంచి విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహించగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.రవిబాబు మాట్లాడారు.











మునగోడులో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - అమరావతి, కారంపూడి, నూజెండ్ల

గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా పల్నాడు మండలంలోని మునగోడులో ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలిసి పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శుక్రవారం పర్యటించారు. ఎస్సీ, బీసీ, మైనారిటీ కాలనీలను సందర్శించడంతోపాటు గ్రామంలో పరిస్థితులపై ప్రజలతో చర్చించారు. డ్రెయినేజీ సమస్యలను కలెక్టర్ దృష్టికి స్థానికులు తెచ్చారు. పారిశుధ్యం, డ్రెయినేనజీ పనులను, ఓటరు జాబితాను కలెక్టర్ పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 నిర్వహణ తీరును సందర్శించారు. గ్రామంలో బాలికలకు హిమోగ్లోబిన్ శాతం ఎంత ఉందో పరిశీలించారు. లేనివారికి వారి తల్లితండ్రుల్లో హిమోగ్లోబిన్ పెరిగే శాతాన్ని, బలమైన ఆహారం తీసుకునే విధంగా వారికి అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. బంగారు తల్లి కార్యక్రమం ఏ విధంగా కొనసాగుతున్నది, ఆడపిల్లలకు బంగారు తల్లి రికార్డులను అందించారా లేదన్నది పరిశీలించారు. అనంతరం క్లాప్ మిత్రులను కలిసి, వారితో కలిసి కాఫీ తాగుతూ క్లాప్ మిత్రాల సమస్యలు ఏ విధంగా ఉన్నాయో, అడిగి తెలుసుకుని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, మండల ప్రత్యేకాధికారి సూర్యప్రకాశ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కారంపూడి మండలంలోని పెదకొదమగుండ్ల పరిధిలోని బ్రాహ్మానాయుడు కాలనీలో మండల ప్రత్యేకాధికారి జోసఫ్ కుమార్, ఎంపిపి ఎం.శారదశ్రీనివాసరెడ్డి పర్యటించారు. అన్ని ప్రాంతాలను పరిశీలించి సీజనల్ వ్యాధులు ప్రాబలకుండా పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. తడి చెత్త, పొడిచెత్త కేంద్రాన్ని సందర్శించి అక్కడున్న పారిశుధ్య సిబ్బందితో మాట్లాడారు. బ్రహ్మనాయుడు కాలనీలో ప్రాంతాలను పరిశీలించి ప్రజల అవసరాలను తెలుసుకున్నారు. ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసరావు, వైసిపి నాయకులు ఎం.అంజిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ఎ.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నూజెండ్ల మండలంలోని జంగాలపల్లిలో మండల ప్రత్యేకాధికారి బి.రవిబాబు పర్యటించారు. పారిశుధ్య పనులు, విలేజ్ క్లినిక్, అంగన్వాడీ కేంద్రాలు, జగనన్న కాలనీలో ఇళ్ళ నిర్మాణం, ఎస్‌డబ్ల్యూపిసి షెడ్, సైడ్ కాల్వలు నిర్మాణాలను పరిశీలించారు. గ్రామ సచివాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. గ్రామ పరిధిలోని పోలింగ్ బూతులకు వెళ్లలేని వారిని గుర్తించి ఓటరు జాబితాలో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులతో కలిసి కాఫీ తాగి, వారిని సత్కరించారు. రక్తంలో హీమోగ్లోబిన్ శాతం 12 గా/డియల్ కంటే తక్కువగా ఉన్న బాలికల గృహాలను సందర్శించి, ఆయా బాలికలకు మరియు తల్లిదండ్రులుకు ఐరన్ ఎక్కువగా లభించే ఆహార పదార్థాలు గురించి అవగాహన కల్పించారు.



అమరావతి మండలం మునుగోడులో ఎమ్మెల్యేతో కలిసి పర్యటిస్తున్న కలెక్టర్ శివశంకర్


పొన్నూరులో


చేబ్రోలులో

కుటుంబ సభ్యుల్ని బెదిరించడం మానుకోండి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణం లోని తాసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ నిరవధి సమ్మె కొనసాగుతుంది సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ అంగన్వాడీలకు మద్దతు తెలిపి ప్రసంగించారు. ముందుగా సమ్మె సిబిరం నుండి సిడిపిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సిడిపిఒం కార్యాలయం వద్ద సిడిపిఒ వెంకటరమణకు అంగన్వాడీలకు నోటీసులు ఇవ్వడం ఆపాలని హెచ్చరించారు. వారి కుటుంబ సభ్యులను బెదిరించడం మానుకోవాలని లేనిచో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. బెదిరింపులు మానుకోకపోతే సూపర్వైజర్ల ఇళ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. చట్టపరంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలను భయభ్రాంతులకు గురి చేస్తే, చూస్తూ ఊరుకోమన్నారు. గుంటూరు, పొన్నూరు మంగళగిరి ప్రాజెక్టు కార్యాలయాల వద్ద బెదిరింపులకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు జరిగాయని మిగిలిన చోట్ల కూడా ఇటువంటి బెదిరింపులకు ప్రత్యక్ష కార్యాచరణకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, పొన్నూరు పట్టణ కార్యదర్శి రమేష్ బాబు, అంగన్వాడి యూనియన్ నాయకురాలు ఎంవి సుకన్య, విజయలక్ష్మి,పద్మజ తదితరులు పాల్గొన్నారు

ప్రజాశక్తి-తాడేపల్లి :తమ డిమాండ్లు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 32వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కోటి సంతకాల కార్యక్రమాన్ని తాడేపల్లి దీక్షా శిబిరంలో విశ్రాంత సైనికోద్యోగి గోపాలం సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే సమ్మెను విరమింపజేయడానికి గల అవకాశాలను పరిశీలించాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు ఎస్‌ఎస్ చెంగయ్య, వేముల దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యను పరిష్కరించి తల్లీపిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించాలని కోరారు.

ప్రజాశక్తి - మంగళగిరి

అంబేద్కర్ సెంటర్లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో అంగన్వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వై కమలాకర్, అంగన్వాడీ యూనియన్ నాయకులు వినీల, భూలక్ష్మి, మేరీ రోజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక వివిఎస్ఆర్ అండ్ ఎన్విఆర్ కళాశాల ఎదురు తెనాలి విజయవాడ రహదారిపై నిర్వహిస్తున్న అంగన్వాడి సమ్మెకు సిఐటియు, సిపిఎం నాయకులు కొల్లిపర బాబుప్రసాద్, షేక్ హుస్సేన్ వలి తమ పూర్తి మద్దతును తెలిపారు. యుటిఎఫ్ జిల్లా నాయకులు కళాధర్, ఎండి దౌల, ఎస్ బసవేశ్వరరావు, జి ప్రసన్నకుమార్, సిహెచ్ రాము మద్దతు తెలిపి ప్రసంగించారు. మాజీ కౌన్సిలర్ కోగంటి రామారావు, వి రాధాకృష్ణ, యు టి ఎఫ్ నాయకులు ఉద్యమ నిధికి రూ 10 వేలు విరాళం అందించారు.


మంగళగిరిలో


పెదకాకానిలో


తాడేపల్లిలో


ఫిరంగిపురం, పెదనందిపాడులో


తాడికొండలో


తెనాలిలో


దుగ్గిరాలలో

ప్రజాశక్తి దుగ్గిరాల

దుగ్గిరాల సమ్మె శిబిరంలో కోటి సంతకాలు సేకరించి తమ సమస్యలు పరిష్కరించమని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి నివేదిస్తామని అంగన్వాడీలు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు జయ సుజాత నాగమణి వెంకటేశ్వరమ్మ రిజ్వాన సిహెచ్ పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ

ప్రభుత్వం అంగన్వాడీలను వెంటనే చర్చలకు పిలిచి తమ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ షేక్ లియాకత్ అలీ అన్నారు. శుక్రవారం తాడికొండలోని పోలీస్ స్టేషన్ వద్ద గత 32 రోజులుగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు కాంగ్రెస్ పార్టీ తరపున మద్దతు తెలిపారు. కార్యక్రమంలో చింతల భాస్కరరావు,సుబ్బాయమ్మ, వెంకటలక్ష్మి, కిషోర్, అబ్దుల్ అలీమ్, శ్రీనివాస్, సూర్యనారాయణ, కోటేశ్వరవు , పులి భరత్ కుమార్ పాల్గొన్నారు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

పెదనందిపాడు సమ్మె శిబిరంలో ముఖ్యమంత్రి మనసు మార్చి తమకు న్యాయం చేయాలని కోరుతూ అంగన్వాడీలు మోకాళ్లపై నిలబడి దండం పెడుతు నిరసన వ్యక్తం చేశారు కార్యక్రమానికి సంఘ మండల అధ్యక్షురాలు శివకుమారి కార్యదర్శి శ్రీదేవి నాయకత్వం వహించారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

పెదకాకానిలో అంగన్వాడీ సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజి మద్దతు తెలిపి మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరింది.అంగన్వాడీల పై అధికారుల బెదిరింపులు ఆపాలనీ సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ అధికారుల డిమాండ్ చేశారు. సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సూపర్వైజర్లు, సిడిపిఓలు అంగన్వాడీలకు నోటీసులు ఇవ్వడానికని ఇళ్లకు వెళ్లి అంగన్వాడీల కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురి చేయడం సరికాదని అన్నారు. ఇటువంటి పద్ధతి కొనసాగితే సూపర్వైజర్ల దగ్గరే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఒకపక్క ప్రభుత్వ మొండి వైఖరి కారణంగా 32 రోజులుగా రోడ్ల మీదే ఆందోళన చేస్తున్న అంగన్వాడీలను అధికారులు బెదిరించడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలని అధికారులకు సూచించారు. శుక్రవారం అంగన్వాడీ యూనియన్స్ కు, ప్రభుత్వ అధికారులకు జరిగే చర్చల ఫలితాలను బట్టి ఆందోళన ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ మండల కార్యదర్శి రత్న మంజుల, విజయలక్ష్మి, రాణి, సువర్ణ కుమారి తదితరులు నాయకత్వం వహించారు.

ప్రజావ్యతిరేక భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

గత 22 రోజులుగా ప్రజా వ్యతిరేక భూమి హక్కు చట్టం రద్దు చేయాలని గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో న్యాయవాదులు తమ విధులు బహిష్కరించి, నిరసన తెలియజేస్తున్నారు. అందులో భాగంగా గుంటూరు బార్ అసోసియేషన్ పిలుపు మేరకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు శుక్రవారం స్థానిక నగరంపాలెం, గుర్రం జాషువా విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ఇప్పటి వరకూ భూ వివాదాలను స్వయంప్రతిపత్తి కలిగిన, సంపూర్ణ న్యాయపరిజ్ఞానం కలిగిన న్యాయస్థానాలు మాత్రమే తీర్పులు ఇస్తున్నాయని, కానీ నూతన చట్టంలో రెవెన్యూ అధికారులు మాత్రమే భూమి శాశ్వత యాజమాన్య హక్కును నిర్ణయించటం న్యాయసూత్రాలకు విరుద్ధమన్నారు. ఈ చట్టం ప్రకారం ఆస్థి యజమాని మరణిస్తే వారసుడు ఎవరనేది రెవెన్యూ అధికారులే నిర్ణయించటం, కోర్టును ఆశ్రయించే హక్కు బాధితుడికి కాక, రెవెన్యూ అధికారుల అనుమతిస్తేనే కోర్టుకు పంపటం సరికాదన్నారు. రాజ్యాంగ పరంగా స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన న్యాయవ్యవస్తే ఆస్థి వివాదాలకు దీప స్థంబంలాగా ఉండాలని, రెవెన్యూ అధికారులను న్యాయాదిపతుల్ని చేసే ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళతామని చెప్పారు. తక్షణమే నూతన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కెవికె సురేష్, ఉద్యమ కమిటీ నాయకులు, టిడిపి నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు కోవెలమూడి రవీంద్ర, నసీర్ అహ్మద్, ప్రత్తిపాడు ఇన్‌చార్జి బి.రామాంజనేయులు, టిడిపి నాయకులు నిమ్మల శేషయ్య, జనసేన రాష్ట్ర నాయకులు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, వివిధ పార్టీల లీగల్ సెల్స్ అధ్యక్ష, కార్యదర్శులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న న్యాయ వాదులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు

క్రమబద్ధీకరణ విషయంలో ప్రలోభాలకు గురికావద్దు

డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు

వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అందర్నీ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా క్రమబద్ధీకరించటం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. క్రమబద్ధీకరణ విషయంలో ఉద్యోగులు ఎలాంటి ప్రలోభాలకూ లోను కావద్దని, ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, ఎవరికీ నగదు ఇచ్చి మోసపోవద్దని చెప్పారు. వివరాలు ఏవైనా కావాలంటే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని సంప్రదించాలని సూచించారు.


జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన అతిథులు

సమాజాభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలి

ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఉన్నత చదువులను పూర్తి చేసుకున్న విద్యార్థులు సమాజ అభ్యున్నతికి, జాతి పురోగతి కోసం శ్రమించాలని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పి సత్యనారాయణన్ సూచించారు. శుక్రవారం ఉదయం ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆవరణలో మొట్టమొదటి పూర్వ విద్యార్థుల ప్రత్యేక సమావేశం జరిగింది. 2017 నుంచి ఇప్పటి వరకూ ఇంజినీరింగ్ చదువులు పూర్తి చేసుకున్న పలువురు విద్యార్థులు సమావేశానికి హాజరయ్యారు. డైరెక్టరేట్ ఆఫ్ అలూమ్ని రిలేషన్స్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. దృశ్యమాధ్యమ పద్ధతిలో (ఆన్లైన్) సమావేశంలో పాల్గొన్న డాక్టర్ సత్యనారాయణన్ పూర్వ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సొంత వూరును, చదువుకున్న విద్యాసంస్థను విద్యార్థులు మరిచిపోరా దంటూ, యూనివర్సిటీ పురోగతి కోసం ఎల్లపుడూ సంసిద్ధంగా ఉండాలని కోరారు. వినయం, క్రమశిక్షణ, శ్రమించే తత్వం విద్యార్థుల ఉజ్వల భవితకు పునాదులు వేస్తాయని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా పేర్కొన్నారు. అనంతరం రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా, ఈశ్వరి స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ విష్ణుపథ్, డాక్టర్ జయశీలన్, పారి స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ డాక్టర్ భరద్వాజ్ తదితరులు విద్యార్థులను ద్దేశించి ప్రసంగించారు. ఏటా ఈ తరహా మీట్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుంటున్నామని వీసీ మనోజ్ కుమార్ అరోరా పేర్కొన్నారు. సమావేశంలో వర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య వజ్జా సాంబశివరావు, రిజిస్టార్ డాక్టర్ ప్రేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవిష్ణు జూనియర్ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి

విద్యార్థులు విద్యను అభ్యసించడం ద్వారా భవిష్యత్తు ప్రగతి మార్గంలో పయనించడానికి ఉపయోగపడుతుందని నిర్మల జూనియర్ కళాశాల డైరెక్టర్ వివి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మంగళగిరి శ్రీ విష్ణు జూనియర్ కళాశాల వార్షికోత్సవం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ టి మనోజ్ అధ్యక్షతన సభ నిర్వహించారు. కార్యక్రమంలో విజెపి అండ్ డివిఎల్‌బి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ వివి జవహర్లాల్, రవీంద్ర, అధ్యాపకులు సిహెచ్ జనార్ధన్, వి.సతీష్, కె రమణారెడ్డి, బి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, కే జ్యోతి పాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో క్రీడల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.



27వ వార్డులో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులు వచ్చిన నేపథ్యంలో పట్టణంలోని 27వ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టినట్లు కౌన్సిలర్ ఎ.శ్రీలక్ష్మీ శుక్రవారం తెలిపారు. రోడ్లు, సైడు కాల్వలను అభివృద్ధి చేస్తున్నామని, తిరుతమ్మ గుడి వద్ద రోడ్లు, విశ్వనాథ్ థియేటర్ పక్క బజరులో కాల్వలు నిర్మిస్తున్నామని చెప్పారు. వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం ప్రతి సచివాలయానికి ప్రభుత్వం కేటాయించిన రూ.20 లక్షలతోపాటు మంత్రి విడదల రజిని ప్రత్యేక చొరవతో మరో రూ.20 లక్షలు మంజూరైనట్లు కౌన్సిలర్ తెలిపారు. మొత్తం రూ.40 లక్షలతో పనులు చేపట్టామన్నారు. రోడ్డుకు రూ.22 లక్షలు, కాల్వలకు రూ.14 లక్షలు వెచ్చిస్తున్నట్లు కౌన్సిలర్ తెలిపారు.




ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్

నీటి నిల్వలే దోమలకు పుట్టిళ్లు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కీటక జనిత వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని 13 వార్డు సచివాలయం పరిధిలో శుక్రవారం జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి పరిశీలించారు. ఇంటింటికి తిరిగి దోమలు వలన సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించారు. నీటి నిల్వలు దోమలకు పుట్టినిల్లు అని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల వల్ల మలేరియా, చికున్ గున్యా, మెదడువాపు, బోధకాలు తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా సూపర్వైజర్లు బి.రోశయ్య,వై రాజేష్‌పాల్, హెల్త్ అసిస్టెంట్లు షేక్ షరీఫ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏపీ ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షులుగా నాని

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఏపి ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షునిగా తలారి నానిని రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని నాని కలిసి తన నియామకాన్ని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే వైసిపిలో కీలక పాత్ర పోషిస్తున్న నానికి ఎమ్మార్పీఎస్‌లోనూ కీలక పదవి దక్కడం అభినందనీయమన్నారు. మరింత ఉన్న స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. నాని మాట్లాడుతూ మాదిగలకు ఎస్సీ వర్గీకరణ చేసి వైసిపి ప్రభుత్వం మళ్లీ వచ్చేలా, జగన్‌మోహన్‌రెడ్డి సిఎం అయ్యేలా కృషి చేస్తామన్నారు.

యువత వివేకానందుని స్ఫూర్తిని పొందాలి



ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్వామి వివేకానంద, ఎల్లాప్రగడ సుబ్బారావు జయంతిని మండలంలోని మురికిపూడి జెడ్‌పి పాఠశాలలో జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక డివిజన్ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించగా జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జిబాబు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.గురులింగం మాట్లాడారు. ఆధ్యాత్మిక గురువుగా వివేకానందుడు దేశ ఖ్యాతిని పెంచితే వైద్య, ఔషధ రంగంలో ఎల్లాప్రగడ సుబ్బారావు విశేష సేవలందించారని వివరించారు. శాస్త్రీయ దక్పథ అవస్యకతపై శ్రీనివాసరెడ్డి వివరించారు. అనంతరం పిల్లలకు క్విజ్ నిర్వహించి విజేతలకు బహుమతులుగా 'బ్రూనో బలిదానం' పుస్తకాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు జి.యాకోబు, సభ్యులు జె.బుల్లిబాబు, వి.చంద్రం పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద స్వామి వివేకానంద విగ్రహానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పూలమాలలు వేసి మాట్లాడారు. యువతకు స్ఫూర్తి ప్రదాత, దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన చైతన్యమూర్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. కార్యక్రమంలో పి.వెంకట పవన్ కుమార్, కె.వెంకటేశ్వరరావు, బి.హనుమంతరావు, కె.హరిబాబు పాల్గొన్నారు. జన చైతన్య సమితి ఉపాధ్యక్షులు వెలుతోటి అనిల్ కుమార్ అమరావతిలోని జన చైతన్య సమితి నైపుణ్యాభిఅభివృద్ధి శిక్షణ కేంద్రంలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. జి.చంద్రశేఖర్, సిహెచ్.అశోక్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

స్వామి వివేకానందుని స్ఫూరిని యువత అలవర్చుకోవాలని పట్టణ సిఐ పి.శరత్‌బాబు అన్నారు. స్వామి వివేకానందుని 162వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఆయన విగ్రహానికి సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డితో కలిసి సిఐ శరత్‌బాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి మాట్లాడారు. దేశం కోసం, సమాజం కోసం త్యాగం, సేవ చేసేందుకు దేశ ప్రజలు ముఖ్యంగా యువత వివేకానందుని ఉక్కు సంకల్పంతో ముందుకు రావాలని సూచించారు. గోవిందరెడ్డి మాట్లాడుతూ జయంతి సందర్భంగా ఇక నుండి ఆవయవ దానం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అసక్తిగలవారు తమ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.పుల్లారావు, లక్ష్మీనారాయణ, జి.నరసింహారావు, ఎం.పాపిరెడ్డి, పి.వీరయ్య, సూర్యచంద్ర, ఎం.పాండురంగారావు, సిహెచ్.ప్రసాదు, జి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.





ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - అచ్చంపేట : సంక్రాంతి అంటే మహిళల పండుగని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు భార్య వసంతకుమారి అన్నారు. సంక్రాంతి సందర్భంగా స్థానిక జెడ్‌పి పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో 500 మంది పైగా పాల్గొన్నారు. వారిలో ఐదుగుర్ని విజేతలుగా ఎంపిక చేశారు. మొదటి బహుమతి రూ.40 వేలను అచ్చంపేటకు చెందిన బత్తుల ధనలక్ష్మి సొంతం చేసుకోగా రెండో బహుమతి రూ.25 వేలను బి.మల్లేశ్వరి, మూడో బహుమతి రూ.15 వేలను సుజాత లక్ష్మి, నాలుగో బహుమతి రూ.10 వేలను బి.భార్గవి, ఐదో బహుమతి రూ.5 వేలను జి.నాగ వర్ధిని గెలుసుకున్నారు. వీరికి బహుమతులను వంసత కుమారి ప్రదానం చేసి మాట్లాడారు. న్యాయ నిర్ణేతలుగా బి.రోజారాణి, కె.అంజలి వ్యవహరించగా నాయకులు ఎన్.కళ్యాణ్‌బాబు, జెడ్‌పిటిసి టి.విజయప్రతాపరెడ్డి, ఎంపిపి బి.రజినీ బాయ్, ఎన్.చంద్రబాబు, సర్పంచ్ కె.వీరబాబు, సిహెచ్.చంద్రయ్య పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రతే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అమరావతి


ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. అమరావతిలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లో ఎమ్మెల్యే పాల్గొని పరిశీలించారు. క్యాంపులో 724 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నట్టు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు సిఫార్సు చేస్తామని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపుల్లో 66 రకాల వైద్యపరీక్షలు ఉచితంగా చేస్తారని, 105 రకాల మందులను ఉచితంగా అందజేస్తున్నారని అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో సుమారు రూ.25 కోట్లతో ప్రభుత్వాస్పత్రులు ఆధునీకరిస్తున్నామని, ప్రతి గ్రామంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన వైద్యసేవలను ఇంటి ముందుకే తెచ్చామని చెప్పారు. ఇదిలా ఉండగా అమరావతిలో రూ.3.25 కోట్లతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మొదటి అంతస్తు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం అమరావతికి చెందిన వైసిపి నాయకులు షేక్ ఆదం భార్య రేష్మ (వాలంటీర్) అనారోగ్యంతో అమరావతి ప్రభుత్వ హాస్పటల్లో చికిత్స పొందుతుండగా పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.రాజేశ్వరి, వైసిపి నాయకులు ఎన్.విజయ సాగర్‌బాబు, బి.హనుమంతరావు, హరిబాబు, ఎన్.రాంబాబు, అత్తులూరు పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

కౌలురైతుల ఉసురు తీస్తున్న ప్రభుత్వం : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట



రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కౌలురైతుల ఉసురు తీస్తోందని మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు విమర్శించారు. ఈ మేరకు స్థానిక పండరిపురంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 75 వేల మంది కౌలు రైతులకే బ్యాంకులు రుణాలిచ్చాయని చెప్పడానికి ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి సిగ్గుందా? అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉండగా, ముఖ్యమంత్రి అయ్యాక కూడా రాష్ట్రంలో 15 లక్షల మందికిపైగా కౌలురైతులున్నారని జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా చెప్పిన మాట, వారందరికీ భరోసా ఇస్తామన్న హామీ ఏమైందని అన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం 3 లక్షల మందినే గుర్తించిందని, వారిలోనూ కొద్దిమందికే రుణాలు దక్కాయని చెప్పారు. మిచౌంగ్ తుపాను వల్ల ఎక్కువగా నష్టపోయింది కౌలురైతులే అయినా పైసా సాయం చేయని దుర్మార్గపు ప్రభుత్వమని దుయ్యబట్టారు. కౌల్దార్లను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-ఈపూరు : మండలంలోని ఊడిజర్ల, ఈపూరు, ఎ.ముప్పాళ్ల, కొచ్చర్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి, 33 కెవి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి ఎస్ గాంధీ బాబు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజాశక్తి - రొంపిచర్ల: మండలంలో అన్ని విద్యుత్ సబ్ స్టేషన్లలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఎఇ రాంబాబు శుక్రవారం తెలిపారు. రొంపిచర్ల, సుబ్బయ్య పాలెం, మర్రిచెట్టుపాలెం, బుచ్చిపాపన్నపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తామని తెలిపారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - అచ్చంపేట : అచ్చంపేటలోని వీరభద్ర కాలనీలో టిడిపి కార్యకర్త మల్లెల బాబు అనారోగ్యంతో మరణించడంతో మృతుని కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ఫోన్‌లో పరామర్శించారు. కొంతమొత్తాన్ని ఆర్థిక సాయంగా అందించారు. పరామర్శించిన వారిలో టిడిపి నాయకులు ఎస్.పెద్దశీను, మాబు వలి, సిహెచ్.అనుపకళ, టి.రాంబాబు ఆర్.ప్రసాద్, టి.లక్ష్మీనారాయణ ఉన్నారు.

నల్ల చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - రెంటచింతల : ప్రభుత్వం కొత్తగా తెచ్చి భూహక్కు చట్టం దుర్మార్గమైందని, దాన్ని వెంటనే రద్దు చేయాలని టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి కె.సూర్యరాజ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నల్ల చట్టం ప్రకారం అధికారులకు ప్రజల భూములు ఆస్తులకు సంబంధించిన అంశాలు నమోదు చేసే హక్కు కల్పించినట్లు చెప్పారు. రిజిస్టర్లో ఒకసారి హక్కుదారుడు పేరు నమోదైన తరువాత ఎవరూ కోర్టుకు వెళ్లే అవకాశం ఉండదన్నారు. ఎవరైనా అభ్యంతరం ఉంటే జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన జిల్లా ట్రిబ్యునల్‌లోనే తేల్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ ట్రిబ్యునల్లో న్యాయం జరగకుంటే రాష్ట్ర స్థాయి ట్రిబ్యునల్‌కు, తర్వాత హైకోర్టులో అప్పిలు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ చట్టం వల్ల చిన్న సన్న కారు రైతులు, దళితులు, బీసీ వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. రాజకీయ నాయకులు కనుసన్నల్లో ఉండే రెవెన్యూ శాఖకు హక్కులు కల్పిస్తే నేతలు చుట్టూ తిరగాల్సి వస్తుందని చెప్పారు. సమావేశంలో నాయకులు చెరెడ్డి కృష్ణారెడ్డి, ఎం.రవి పాల్గొన్నారు.

జిఎంసి అద్దెల వసూళ్లకు త్వరలో కొత్త గెజిట్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్లు, షాపులు, మరుగు దొడ్లు, సైకిల్ స్టాండ్లకు రుసుం వసూళ్లు చేసుకునే విధి విధానాల గురించి త్వరలో గెజిట్ తయారు చేయడం జరుగుతుందని అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి తెలిపారు. నగర కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో వివిధ మార్కెట్ వ్యాపారుల సంఘం ప్రతినిధులు, వ్యాపారులు, ఆర్.ఓ.లు, ఆర్.ఐ.లతో నగరంలో ఇప్పటివరకి ఉన్న గెజిట్ పైన ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశంలో తొలుత పాత గెజిట్ వివరాలు, నగరంలో ఉన్న మార్కెట్లు, సైకిల్ స్టాండ్లు టాయ్‌లెట్స్ వివరాలను డిప్యూటీ కమిషనర్ తెలియచేశారు. సదరు అంశాలపై మార్కెట్ వ్యాపారుల సంఘం ప్రతినిధులు, వ్యాపారులు, ప్రజల అభిప్రాయాలు తెలియజేశారు. అనంతరం అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత సమావేశంలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని స్టాండింగ్ కౌన్సిల్‌లో ఆమోదానికి ఉంచటం జరుగుతుం దన్నారు. ప్రస్తుతం జిఎంసికి బకాయి ఉన్నవారు వెంటనే చెల్లించాలని, లేకుంటే గత గెజిట్ ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఆర్.ఓ.లు బాలాజీ బాష, రెహ్మాన్, సాంబశివరావు, రెవెన్యూ సెక్షన్ సూపరిండెంట్ వెంకటరామయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ కె లక్ష్మీ శివజ్యోతి


వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతున్న ఎడిఎ

అపరాల సాగుకు ప్రాధాన్యమివ్వండి : ఎడిఎ

ప్రజాశక్తి దుగ్గిరాల

రబీలో నీరు అందించలేమని ప్రభుత్వం ప్రకటించినందున అపరాల సాగుకే ప్రాధాన్యత ఇవ్వాలని ఎడిఎ ఎన్ ఉషారాణి రైతులను కోరారు. మండల కేంద్రం దుగ్గిరాలలోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. మొక్కజొన్న జొన్న సాగు చేపట్టినట్లయితే నీటి తడుపులు ఎక్కువగా ఇవ్వవలసి ఉంటుందని, మినుము, పెసర సాగు చేయవలసిందిగా రైతులకు సలహానిచ్చారు. బోర్ల ద్వారా డీజిల్ ఇంజన్ల ద్వారా మొక్కజొన్న జొన్న సాగు చేస్తున్న రైతులు రెండు వారాల లోపు పురుగుమందులు తప్పనిసరిగా వాడాలని, తద్వారా కాండం తొలుచు పురుగులు కత్తెర పురుగు బారిన పడకుండా పంటను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి శిరీష,జలవనరుల శాఖ ఎఇ వనిత, ఆదర్శ రైతు ఏ మోహన్ రెడ్డి, పెదపాలెం సర్పంచ్ పాటిబండ్ల కృష్ణ ప్రసాద్ రైతులు కన్నెగంటి నరసింహారావు, పసుపులేటి నాగయ్య, కుర్ర నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లికి చెందిన పలువురు నాయీ బ్రాహ్మణులు శుక్రవారం నులకపేట విద్యుత్ ఎఇ షణ్ముకరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇస్తున్న విద్యుత్ ఛార్జీలు మోత మోగిపోతున్నాయని, పెద్దఎత్తున వస్తున్న విద్యుత్ బిల్లులు తాము చెల్లించలేకపోతున్నామన్నారు. ప్రభుత్వం తమ వృత్తిని దృష్టిలో పెట్టుకుని వెసులుబాటు కల్పించాలని, విద్యుత్ బిల్లులు తగ్గించాలని కోరారు. దీనిపై ఎఇ సానుకూలంగా స్పందించారు. అర్జీని ప్రభుత్వానికి పంపి తగు న్యాయం చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టి.దుర్గారావు, కోటి, విజయ్, సురేష్, రాము, నాగరాజు పాల్గొన్నారు.



109 మంది చేనేత మహిళలకు రాట్నాలు పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి : చేనేతకు చేయూత కార్యక్రమంలో భాగంగా ఏడో విడతలో మంగళగిరి రూరల్ మండలంలోని ఆత్మకూరు, నవులూరు గ్రామాలు, మంగళగిరి పట్టణంలోని టిడ్కో, పాత మంగళగిరి, 5, 6, 8, 9, 17, 19, 20, 24, 26, వార్డులకు చెందిన 109 మంది చేనేత మహిళలకు శుక్రవారం రాట్నాలు పంపిణీ చేశారు. మంగళగిరి పట్టణంలోని ఇందిరానగర్‌లో చేనేత కమిటీ నాయకులు, నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, మంగళగిరి పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కారంపూడి అంకమ్మరావు ఆధ్వర్యంలో రాట్నాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, మంగళగిరి మండల అధ్యక్షులు తోట పార్థసారథి, మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నియోజకవర్గ వాణిజ్య విభాగపు అధ్యక్షులు మాజేటి సూర్యగోపాల కృష్ణ, రాష్ట్ర సాధికార సమితి సభ్యులు అన్నం నాగబాబు తదితరులు ప్రసంగించారు.


కళాశాల ఆవరణలో బోగిమంటలు వేస్తున్న విద్యార్థులు

ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని విశదల అడ్డ రోడ్డు వద్ద గల ఎన్ఆర్ఐ ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులందరూ తెలుగు సాంప్రదాయ వస్త్రధారణతో భోగి మంటలు, ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. హరిదాసుడు, ఎద్దుల బండి ఆకర్షణగా నిలిచాయి. తెలుగు సంస్కృతి ,సాంప్రదాయాలకు ప్రతి రూపమే సంక్రాంతి పండగాని ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కోటా శ్రీనివాసు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరి రావు, రెహమాన్, రాము, చంద్రమౌళి, కేఎస్ రాజు, కె ఎస్ ఆర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సర్పంచ్ జానకి దేవికి అభినందన పత్రం అందజేస్తున్న ఎఇ

గొడవర్రులో ప్రతి ఇంటికీ నీటి కుళాయి

ప్రజాశక్తి - చేబ్రోలు : హర్ ఘర్ జల్ గ్రామంగా గొడవర్రును అధికారులు ప్రకటించారని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సభలో శుక్రవారం అభినందన పత్రాన్ని సర్పంచ్ బి జానకి దేవికి అందజేశారు. జల జీవన్ మిషన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించటమే లక్ష్యమని ఆయన తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఇచ్చేందుకు వాటర్ పైప్ లైన్లతో పాటు ప్రతి ఇంటికి కుళాయి ఇవ్వటం జరిగిందని తెలిపారు. గ్రామ సర్పంచ్ బి జానకి దేవి మాట్లాడుతు గ్రామ ప్రజలు నీటిని వృధా చేయకుండా జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి శ్రీనివాసరావు, జిల్లా కోఆర్డినేటర్లు కేశవ రావు, తేజ్ సంగీత్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ జోగేశ్వర రావు , మండల కోఆర్డినేటర్ జి ప్రసాదరావు పాల్గొన్నారు.

చలపతిలో ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు :లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో అధ్యాపకులకు గత ఐదు రోజులుగా నిర్వహించిన శిక్షణా శిబిరం ముగిసింది.శిక్షణకు ముఖ్య అతిథిగా భువనేశ్వర్‌లోని ఇంటర్నేషనల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ బెల్వాం హాజరై వివిధ విభాగాల అధ్యాపకులకు సేల్స్ అండ్ డిస్ట్రిబ్యూషన్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్ ప్లానింగ్ అండ్ ఎగ్జిక్యూషన్, ఫైనాన్షియల్ అకౌంటింగ్, వేర్‌హైస్ మేనేజ్‌మెంట్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం శిక్షణకు హాజరైన అధ్యాపకులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ, సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ : గ్రామ పంచాయతి, సచివాలయాలల సిబ్బందికి శుక్రవారం ఆర్థిక సంవత్సరానికి సంకల్ప గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణ తరగతులు నిర్వహించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వాహకులు స్వామిరెడ్డి అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో బి ఎల్ పి ఒ లక్ష్మణరావు . డి పి ఎం రవీంద్రలు సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్పీలు శ్రీనివాసరావు నాగయ్య రాజేంద్ర, పలు గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామ సచివాలయ ల సిబ్బంది పాల్గొన్నారు





బిఇడి కౌన్సెలింగ్ వెంటనే నిర్వహించాలి : పిడిఎస్‌యు

ప్రజాశక్తి మంగళగిరి

రాష్ట్రవ్యాప్తంగా 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బిఎడ్ (బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్) విద్యార్థుల కౌన్సిలింగ్ ను వెంటనే నిర్వహించాలని పిడిఎస్‌యు జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ, జాతీయ నాయకులు యూ. గనిరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మంగళగిరిలో ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ కె. రామమోహన్ రావుకు పి.డి.యస్.యు ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. బీఎడ్ ఫలితాలు విడుదలై ఆరు నెలల పూర్తవుతున్నా నేటికీ కౌన్సిలింగ్ ను ప్రభుత్వం నిర్వహించలేదని అన్నారు. దీనివలన విద్యార్థులు ఒక విద్యా సంవత్సరం కోల్పోవలసి వస్తుందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా 523 ప్రభుత్వ మరియు ప్రైవేట్ బీఎడ్ కళాశాలలు ఉన్నాయని, వీటిలో10,908 మంది బిఎడ్ ప్రవేశ పరీక్షలు ఉత్తీర్ణత సాధించినారని ఆన్నారు. అక్రమాలకు నిలయమైన ప్రైవేట్ బి.ఎడ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలే తప్ప కౌన్సిలింగ్ ఆపడం సరైనది కాదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, ఫీజు రెగ్యులేషన్ మానిటరింగ్ కమిటీ కళాశాలల ఫీజులు నిర్ధారించారని, అయినప్పటికీ కౌన్సిలింగ్ నిర్వహించకపోవడం వల్ల 10, 908 మంది ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈరోజు కౌన్సిలింగ్ కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. బి. ఎడ్ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని దుయ్య బట్టారు. రాష్ట్రంలో అన్ని ప్రవేశ పరీక్షలకు సంబంధించి అడ్మిషన్లు పూర్తయి సగం విద్యా సంవత్సరం కూడా పూర్తయిందని, ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే బిఎడ్ కౌన్సిలింగ్ నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు వైష్ణవ్, గురు విష్ణు, తెజేష్,, సాయి, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఫ్రైడే డ్రైడే అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి తెనాలి :స్థానిక అయితానగర్, చినరావూరు యానాది కాలనీలో శుక్రవారం జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు ఆరోగ్య సిబ్బంది, మలేరియా సిబ్బంది సంయుక్తంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. దోమలు ప్రజారోగ్యానికి మొదటి శత్రువులని, నీటి నిల్వలు దోమల అభివృద్ధికి ఆవాసాలని, దోమతెరలు వాడాలని ర్యాలీలో ప్రజలకు వివరించారు. దోమకాటుతో ప్రమాదకరమైన వ్యాధులు మలేరియా,డెంగీ, చికెన్ గునియా, మెదడువాపు, బోదకాలు, జికా వైరస్ వంటి వ్యాధుల వ్యాప్తి చెందుతాయని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్లు ఎస్ ఉమాకాంత్, అందె బాలచంద్రమౌళి, డి.శ్రీనివాసరావు, డి మల్లేశ్వరరావు, రషీద్, నవీద్, ఝాన్సీ, పి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

బిసిలను విస్మరించిన పార్టీలు కనుమరుగు : కేశన

ప్రజాశక్తి - మంగళగిరి


మాట్లాడుతున్న కేశన శంకరరావు

బీసీల సమస్యలపై స్పందించని బిసి ప్రజా ప్రతినిధులు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు పేర్కొన్నారు. శుక్రవారం మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేశన మాట్లాడారు. రాజ్యాంగం ఆర్టికల్ 21 వ్యక్తిగత స్వేచ్ఛతో పౌరలందరికీ జీవించే హక్కు కల్పించిందని, ఆర్టికల్17 ద్వారా అంటరానితనం నిషేధించబడిందని దేశ కుల రహిత సమాజంగా రూపాంతరం చెంది పౌరుల మధ్య సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతలు తొలగించుటకు రాజ్యాంగం అంతిమ లక్ష్యంగా నిర్దేశించారని స్పష్టం చేశారు. వివిధ కుల సంఘ నాయకులు కులాన్ని అడ్డుపెట్టుకొని వివిధ పార్టీలలో సీట్లు తెచ్చుకొని ఎన్నికలలో గెలిచిన అనంతరం కుల సంఘాలను విస్మరిస్తూ తమ మనుగడకు పెరుగుదలకు ప్రయత్నిస్తున్నారన్నారు. కొందరు రాజ్యాధికారం కొరకు ఆయా పార్టీలకు తొత్తులుగా వ్యవహరించి నైతిక హక్కును ఎవరిచ్చారని బీసీ సంఘాలు ఘోషిస్తున్న విషయాలు నిజం కాదా అని కేసన శంకరరావు ప్రశ్నించారు. బీసీల ఓట్లతో గెలిచి బీసీ సమస్యలపై ఏరోజైనా ప్రజాప్రతినిధులు మాట్లాడారా, బీసీల అభ్యున్నతి కొరకు మీరు నోరు మెదపరన్నారు. రాబోయే ఎన్నికలలో బీసీలను విస్మరించే పార్టీలు కనుమరుగైపోతాయని కేతన శంకర్రావు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, కే శివరావు, ఉప్పాల రాజ్ కిరణ్, ఆలా శివాజీ, కాట్రుధనుంజయరావు, మంద్రు సత్యనారాయణ, తిరువీధుల కిరణ్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మాచర్లకు 8వ ర్యాంక్



ప్రజాశక్తి - మాచర్ల

రాష్ట్ర పరిధిలోని 93 మున్సిపాలిటీలలో స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకింగ్‌లో మాచర్ల మున్సిపాలిటీకి 8వ స్థానం దక్కింది. సౌత్ ఇండియా స్థాయిలో స్కోచ్ ఆవార్డు, జిల్లా స్థాయిలో పలు ఆవార్డులు మరవక ముందే స్వచ్ఛ సర్వేక్షన్‌లో జిల్లా స్థాయిలో ప్రధమ ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంక్ దక్కడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కమిషనర్ ఇవి రమణ బాబును అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రమణబాబు మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి తడి, పోడి చెత్త సేకరణ, హానికర చెత్తలను వేరు చేయటం, పొడి చెత్తను రీ సైకిల్ చేయడం, పారిశుధ్య నిర్వహణ, కాలువల్లో పూడిక తొలగింపు ప్లాస్టిక్ నివారణ తదితర అంశాలతో తాము క్లీన్ మాచర్ల - గ్రీన్ మాచర్ల కార్యక్రమాన్ని ప్రజల సహకారంతో మెరుగైన పనితీరు చేపట్టినట్లు తెలిపారు. 25 ఎకరాల డంపింగ్ యార్డులో 5 ఎకరాల విన్‌డ్రో కంపోస్టు ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆవార్డు దక్కేందుకు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, చైర్మన్ మాచర్ల చినఏసోబు, కౌన్సిల్, సహ అధికారులు, సిబ్బంది సహకారం ఎంతో ఉందన్నారు.

హిందూ ఫార్మసీలో యువజనోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న ప్రవరాజిక బోధమయ ప్రాణ మాతాజీ

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో స్వామి వివేకానంద జన్మదినం సందర్భంగా యువజనోత్సవ వేడుకలు నిర్వహించారు. కళాశాల పాలక మండలి కార్యదర్శి డాక్టర్ ఎస్.మధు సూదనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమ ంలో తొలుత స్వామి వివేకానంద చిత్రప టానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమానికి రామకష్ణ శారద విద్యాలయ ప్రిన్సిపల్ ప్రవరాజిక బోధమయ ప్రాణ మాతాజీ, వైస్ ప్రిన్సిపల్ ప్రవరాజిక కళ్యానాత్మ ప్రాణ మాతాజీ, హిందూ కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ, కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మ్.డి. డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్మలా ఫార్మసీలో వివేకానంద జయంతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



మంగళగిరిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ యువజన ఉత్సవాలలో భాగంగా కళాశాలలో గత వారం రోజులుగా పలు కార్యక్రమాలను నిర్వహించామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రం ఆఫీసర్ రేఖా నరేష్ బాబు తెలిపారు. స్వామి వివేకానంద చిత్ర పటానికి తొలుత కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ జి నిర్మల జ్యోతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి పాముల రెడ్డి , ఇతర అధ్యాపకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు యువత శ్రీ స్వామి వివేకానంద నుండి స్ఫూర్తిని పొందాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక సమన్వయకర్త ఆర్ నరసింహ నాయక్, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ బి దివ్య తదితరులు పాల్గొన్నారు.



వివేకానంద చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గోపాలకృష్ణ, తదితరులు

ఆర్‌విఆర్‌లో జాతీయ యువజనోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు : దేశ ప్రగతి నిర్మాణంలో యువశక్తి కీలకమనే భావనతో యువతను జాగృతి చేయటంలో స్వామి వివేకానంద చేసిన ప్రసంగాలు దేశానికే ఆదర్శమని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో జాతీయ యువజన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.విద్యార్థులు జాతీయగీతాలు ఆలపించి, నృత్యం చేశారు. కార్యక్రమంలో ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎం.సుధాకర్, కె.ఉపేంద్రచౌదరి, డాక్టర్ కె.కొండలరావు, డాక్టర్ ఎం.అనిత తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటంలో ఘనంగా వివేకానంద జయంతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : స్వామి వివేకానంద జయంతి వేడుకలు శుక్రవారం ఎంటిఎంసీ పరిధిలోని ఇప్పటం గ్రామంలో ఘనంగా జరిగాయి. వివేకానందుని విగ్రహానికి వైసిపి తాడేపల్లి మండల నాయకులు మున్నంగి వివేకానంద రెడ్డి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివేకానంద రెడ్డి మాట్లాడుతూ సమాజానికి వివేకానంద బోధనలు ఎంత అవసరమని అన్నారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ నాయకులు లచ్చి వెంకటేశ్వరరావు, లచ్చి తులసీదాస్, వీరంకి హరిబాబు, ప్రవీణ్, వెంకటేశ్వరరావు, గాజుల లక్ష్మీనారాయణ, బ్రహ్మ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వివేకానంద జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి నాయకులు

కొండవీడు కోట అభివృద్ధికి కృషి : పల్నాడు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :కొండవీడు కోట అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. శుక్రవారం యడ్లపాడు మండలం కొండవీడు కోటలో పర్యటించారు. కొండవీడు నగరవనంలో నడికట్టు రామిరెడ్డిసేవ సమితి, చిరుమామిళ్ల వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. నడికట్టు రామిరెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో నగరవనంలో ఏర్పాటు చేసిన వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం కొండవీడు లోని వెదుళ్ల చెరువులో బోటింగ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా అటవీ అధికారి రామచంద్రయ్య, తహశీల్దార్ వైవైబి కుటుంబరావు, ఎంపీడీఓ హనుమారెడ్డి, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


వెదుళ్లచెరువులో కలెక్టర్ బోటింగ్

చలపతి ఫార్మసీలో లియో సంస్థ కార్యాలయం

ప్రజాశక్తి-గుంటూరు :లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో లియో గ్లోబల్ ఓవర్సీస్ ప్రైవేటు లిమిటెడ్ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని శుక్రవారం లియో సంస్థ డైరెక్టర్ కె.ప్రసన్నలక్ష్మి, బ్రాంచ్ మేనేజర్ యన్.అనూహ్య, మార్కెటింగ్ మేనేజర్ నాగూర్, యుఎస్‌యుకె టీం లీడర్లు నాగమణి, వీణా, చలపతి విద్యా సంస్థల సెక్రెటరీ వై.సుజిత్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల, లియో సంస్థతో పరస్పర ఒప్పందం కుదుర్చుకుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యాలయం వారంలో రెండ్రోజులు కళాశాలలో అందుబాటులో ఉంటుందని, విద్యార్థులకు అవసరమైన పాస్‌పోర్ట్ అప్లికేషన్, స్లాట్ బుకింగ్, విద్యార్థుల యూనివర్సిటీ షార్ట్‌లిస్ట్, కెరీర్ గైడెన్స్, స్కాలర్‌షిప్ గైడెన్స్, లోన్ సర్వీసు, పోస్ట్ ల్యాండ్ సర్వీసు, ఉచిత ఇంగ్లీషు లాంగ్వేజి ప్రొఫెషియన్సీ కోర్సు శిక్షణ ఇస్తారని, విద్యార్థులు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.


ప్రారంభిస్తున్న సుజిత్, తదితరులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న తాండవకృష్ణ

సుందరయ్య నగర్‌లో ఆటల పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక 41వ డివిజన్ పరిధిలోని పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో శుక్రవారం సంక్రాంతి సండుగను పురస్కరించుకొని ఐద్వా, సిఐటియు, కెవిపిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. కుర్చీలాట, లెమన్ అండ్ స్పూన్, తాడు లాగటం, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ యుపి స్కూల్ ప్రిన్సిపాల్ తాండవకృష్ణ బహుమతులు అందచేశారు. సుందరయ్య నగర్ సిపియం శాఖ కార్యదర్శి షేక్.ఖాసిం షహీద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తాండవకృష్ణ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటే అందరూ కలసి ఒక చోట చేరి, సరదాగా ఆటలు, పాటలతో గడపాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఐకమత్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్షురాలు జి.రమణ, పుచ్చలపల్లి సుందరయ్య నగర్ అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఆది నికల్సన్, మహిళా సంఘం స్థానిక కార్యదర్శి షేక్.ఖాజాబి, సభ్యులు కె.నాగమల్లేశ్వరి, కె.సుజాత, ఆదిలక్ష్మి, సిఐటియు నాయకులు ఎస్.పద్మనాభుడు పాల్గొన్నారు.

నేడు గుంటూరుకు చంద్రబాబు రాక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :వివిధ కేసుల్లో హైకోర్టునుంచి బెయిలు పొందిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు వ్యక్తిగత ష్యూరిటీలు సమర్పించేందుకు శనివారం మధ్యాహ్నం గుంటూరు రానున్నారు. మూడు గంటలకు గుంటూరులోని ప్రాంతీయ కార్యాలయానికి వస్తారు. తరువాత కుంచనపల్లి లోని సిఐడి కార్యాలయానికి వెళ్తారు. అక్కడ నుంచి విజయవాడ తాడిగడపలోని సిఐడి కార్యాలయానికి వెళతారు. ఒకే రోజుమూడు ప్రాంతాల్లో ఉన్న సిఐడి కార్యాలయాలను ఆయన సందర్శించి వ్యక్తిగత ష్యూరిటీలు సమర్పిస్తారని టిడిపి వర్గాలు తెలిపాయి.

కేంద్రమంత్రికి జిల్లా అధికారుల స్వాగతం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి :కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డికి శుక్రవారం గుంటూరు రైల్వేస్టేషన్‌లో జిల్లా ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ , గుంటూరు రైల్వే డివిజన్ మేనేజర్ రామకృష్ణ, రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీకర్ లు మర్యాద పూర్వకంగా కలసి పుష్ప గుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లను కేంద్ర మంత్రి ప్రారంభించారు.


కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్

విజ్ఞాన్‌లో ఘనంగా ముందస్తు సంక్రాంతి

ప్రజాశక్తి-గుంటూరు


చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న రత్తయ్య, శ్రీకృష్ణదేవరాయలు

సంక్రాంతి విశిష్టతను తెలిపే రంగురంగుల రంగవల్లులు, హరిదాసు సంకీర్తనలు, కోలాటాలతో తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా వడ్లమూడ లోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే రైతుల పండుగని, మన పండుగల్లోని విశిష్టతను, శాస్త్రీయతను విద్యార్థులు గుర్తించాలని సూచించారు. ఈ సమయంలో రైతు లోకం పంట చేతికొచ్చిన ఆనందం లో ఉంటుందని చెప్పారు. విజ్ఞాన్స్ వైస్ చైర్మన్ లావు శ్రీకష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రతి విషయాన్ని వినూత్నంగా ఆలోచించాలని సూచించారు. సంక్రాంతి సంబరాలతో వర్సిటీ ప్రాంగణం పండుగ శోభ సంతరించుకుంది. చిన్నారులకు భోగి పళ్లు పోశారు. చెరుకుగడలు అల్లారు. రంగురంగుల ముగ్గులు, భోగి మంటలు, సంక్రాంతి పాటలు, బొమ్మల కొలువులు ఏర్పాటుచేశారు. హరిదాసు సంకీర్తనలు వినిపించాడు. పిండి వంటలు వండారు. డోలు, సన్నాయిలతో వినోద బందం కనువిందు చేసింది. గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

సిఎంఎ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌటెంట్స్ ఆఫ్ ఇండియా గురువారం ప్రకటించిన సిఎంఎ ఫౌండేషన్ ఫలితాలలో శ్రీమేధ విద్యార్థులు ఆలిండియా టాప్ మార్కులతోపాటు అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించారని సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ తెలియజేశారు. ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను శుక్రవారం అభినందించారు. గత 19 సంవత్సరాలుగా సిఎ, సిఎంఎ కోర్సులలో 400లకుపైగా ఆలిండియా ర్యాంకులు సాధించామన్నారు. ప్రస్తుత ఫలితాలలో తమ విద్యార్థిని టి.ఆలివ్ గ్లోరియానా 400 మార్కులకు 356, కె.యోగితారెడ్డి 352, టి.నందినిదుర్గ 342, ఎ.సాయి వెంకటధీరజ్ 340 వంటి టాప్ మార్కులు సాధించారని చెప్పారు. వెంకట ధీరజ్ మ్యాథ్స్, స్టాటిస్టిక్స్‌లో వందకు వంద మార్కులు సాధించారన్నారు. ఇంటర్ నుండి సిఎ, సిఎంఎ ఫౌండేషన్ కోర్సులకు కాయిన్ బ్యాచ్ ప్రోగ్రాం ద్వారా అనుభవజ్ఞులైన అధ్యాపకులచే కోచింగ్ అందించటం ద్వారా తమ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో టాప్ మార్కులు సాధించారన్నారు. సిఎంఎ ఫౌండేషన్ ఉత్తీర్ణులైన వారికి సిఎంఎ ఇంటర్ క్లాసులు, సిఎంఎ ఫౌండేషన్ ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు సిఎంఎ ఫౌండేషన్ క్రాష్ బ్యాచ్ క్లాసులు ఈనెల 22 నుండి ప్రారంభం అవుతాయన్నారు. టాపర్లను శ్రీమేధ చైర్మన్ అన్నా నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి అధ్యాపకులు అభినందించారు.


టాపర్లతో సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్